క్లుప్తంగా

రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు



దంతాలపల్లి : నకిలీ విత్తనాలు, ప్రభుత్వ నిషేధిత ఎరువులు విక్రయించిన, రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు రశీదులు ఇవ్వకుండా మోసం చేస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ మండల వ్యవసాయాధికారి మంజుఖాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే నడుచుకోవాలని గుర్తుచేశారు. అనంతరం షాపు యజమానులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దీక్షిత్ కుమార్, షాపుల యజమానులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా క్లాసులను జయప్రదం చేయండి

కేసముద్రం : జూలై 3 నుండి 5వ తేదీ వరకు మండల కేంద్రంలో నిర్వహించనున్న సీపీఎం జిల్లా క్లాసులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు గునిగంటి రాజన్న కోరారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందన్నారు. పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, పాపారావు, శ్రీశైలం, యాకుబ్‌రెడ్డి, వెంకన్న, సావిత్ర, ఉప్పలయ్య, శ్రీను పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం: రాష్ట్ర వ్యాప్తంగా జీపీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లకంటి సూర్యం డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రవికి ఆ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే.భాస్కర్‌రెడ్డి, ఈరెల్లి మల్లేష్, జిల్లా అధ్యక్షుడు కందాల రంగయ్య పాల్గొన్నారు.

పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయండి

మహబూబాబాద్ అర్బన్: విద్యారంగ సమస్యలపై బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అచ్చ సుజిత్, పట్టణ ప్రధాన కార్యదర్శి భూక్య రేవంత్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రైవేట్‌లో అక్రమంగా రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. బాలు, పృథ్వీ, మహేష్, శ్రీను, రాజు, నవీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డోర్నకల్ : రైల్వే కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మజ్దూర్ యూనియన్ డివిజనల్ ప్రెసిడెంట్ ఖాజాబాబా, డోర్నకల్ బ్రాంచి సెక్రటరీ అంజియాదవ్ కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏడీఈఎస్ రమేశ్, రైల్వే డీఎంఓ సునీల్‌నాయక్‌ను మంగళవారం మజ్దూర్ యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు యూనిట్ల పరిధిలో టూల్, రెస్ట్ రూములు నిర్మించాలని కోరారు. డోర్నకల్, ఖమ్మం రైల్వే కాలనీల్లో రైల్వే క్వార్టర్లకు మరమ్మతు పనులు చేపట్టాలని, ఎల్‌సీ గేట్ల వద్ద తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని కోరారు. ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందిస్తున్నారంటూ డాక్టర్ సునీల్‌నాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ చైర్మన్ చరణ్‌నాయక్, నాయకులు సత్యనారాయణ, సుందర్, బాలాజీ, రమేశ్, దిలీప్ పాల్గొన్నారు.

రైల్వే డీఆర్ఎంకు వినతి

గార్ల: రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలు కల్పించి, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని కోరుతూ మంగళవారం గార్లకు చెందిన పలువురు డీఆర్ఎం భరతేష్‌కుమార్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. స్టేషన్‌కు ప్రతీఏటా ప్రయాణికుల ద్వారా రూ.1 కోటి ఆదాయం వస్తున్నందున, స్టేషన్‌లో కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు, ప్రయాణికుల సౌకర్యార్థం స్టేషన్‌లో శాతవాహన, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలని డీఆర్ఎంను కోరారు. అదే విధంగా గార్ల రైల్వే అండర్ బ్రిడ్జిలో ప్రతీ ఏటా వర్షాకాలంలో నీరు నిలిచి ఉంటూ పాకురు పట్టడంతో బ్రిడ్జి కింది నుంచి వాహనదారులు వెళ్లలేక పోతున్నారని పేర్కొన్నారు. దీనిపై డీఆర్ఎం సానుకూలంగా స్పందించారు. రాధాకృష్ణ, ఈశ్వర్‌లింగం, శ్రీనివాసరావు, రాజశేఖర్, రాజేష్ ఉన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

● మహబూబాబాద్ ఎంఈఓ పూల్‌చంద్

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ పూల్‌చంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం మండల స్థాయిలో స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడల్లో రాణించాలనుకొనే విద్యార్థులకు ఇది ఒక మంచి సదావకాశమన్నారు. మండలస్థాయి ఎంపికలు నిర్వహించగా బాలికలు, బాలురు 20 మంది చొప్పున ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో పీఈటీ, పీడీలు దివ్యభారతి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పద్మ, సింధువర్మ, బాస్కెట్ బాల్ కోచ్ కుమారస్వామి, పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు

మరిపెడ : మండల స్థాయి హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు నిర్వహించడం జరిగిందని ఫిజికల్ డైరెక్టర్ రాజకుమారి తెలిపారు. మండంలోని సీతారాంపురం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ క్రీడలనుద్దేశించి ప్రధానోపాధ్యాయులు అనంతరావు మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారన్నారు. 20 మంది బాలికలు, 20 మంది బాలురను జిల్లాస్థాయికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రామ్మోహన్, జనార్ధనచారి, పీడీలు రమ, రాంబాబు, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్ : స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు నిర్వహిస్తున్న పీడీలు, పీఈటీలు

డోర్నకల్: మండలస్థాయిలో నిర్వహించిన క్రీడా ఎంపికల్లో 800 మీటర్ల పరుగు, 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, షటిల్ రన్, వర్టికల్ జంప్‌తో పాటు ఇతర పోటీలు నిర్వహించారు. హెచ్ఎం నర్సింహారావు, ఎంఎస్‌డీఓ కె.రవికుమార్, ఎస్ శ్రీను, రామ్మూర్తి, గోవర్ధన్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

కురవి: మండల స్థాయి ఎంపిక పోటీలను మంగళవారం జెడ్పీ హైస్కూల్ మైదానంలో నిర్వహించారు. మొత్తం 30 మంది విద్యార్థులు పాల్గొనగా చేగువేరా, అమృత, మంజుల, మేఘమాల, కార్తీక్, అశ్విత్, గాంధర్వికలను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎండీ వాహిద్, పీడీలు వీరభద్రం, ప్రేమ్‌కుమార్, జ్యోతి, కాశీనాథ్, సునీల్, కమల్‌కిషోర్, భారతి పాల్గొన్నారు.

పెద్దవంగర: మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఎంపిక పోటీలకు హాజరు కాగా మండల నోడల్ అధికారి బుదారపు శ్రీనివాస్ మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లా స్థాయి ఎంపికలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మండల ఫిజికల్ డైరెక్టర్లు ప్రభాకర్, సురేందర్, పీఈటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మరిపెడ : పరుగుపందెం పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు



కురవి : జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో పీడీలు

ఆడపిల్లలు ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలి

మహబూబాబాద్ అర్బన్ : పాఠశాలలో ఆడపిల్లలు ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో మంగళవారం షీ టీం ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో ఫోన్‌లో గాని, నేరుగా గానీ మాట్లాడవద్దన్నారు. తెలియని గ్రూప్‌లో నుంచి వచ్చిన మెసేజ్‌ల లింకులను ప్రెస్ చేయవద్దన్నారు. బ్యాంకు అకౌంట్ల నుంచి డబ్బులు పోయినప్పుడు వెంటనే 1930కు ఫోన్ చేయాలన్నారు. పోక్సో, బాల్య వివాహాలు, మానవ అక్రమరవాణా, ఉమెన్ సేఫ్టీ, సెక్యూరిటీ క్యూఆర్, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వేధింపులకు గురైనప్పుడు షీ టీం వాట్సాప్ 871265935, 7901142009 నంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షీ టీం ఎస్సై సునంద

బీమా చెక్కు అందజేత

గూడూరు: మండలంలోని బొల్లెపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బానోతు గణపతి కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతనికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు బానోతు హరినాయక్ మృతుడి భార్యకు అందించారు. వెంకటాచారి, అజ్మీరా రవి, రాజన్, శ్రీనివాస్, భీమా, మహేందర్, అనిల్ పాల్గొన్నారు.

'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి

నర్సింహులపేట: రైతు వేదికలో నిర్వహించే రైతు నేస్తం ప్రోగ్రాంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ శోభన్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో సీజన్‌లో రైతుల పంటల అధిక దిగుబడి కోసం అధికారులు, శాస్త్రవేత్తలు సూచనలు ఇచ్చే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఓ రాకేష్, ఏఓ మంజుఖాన్, ఏఓలు, ఏఈఓలు రామకృష్ణ, కరిష్మా పాల్గొన్నారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గార్ల: మండలంలోని మర్రిగూడెం పంచాయతీ సరిహద్దు తండాలో మంగళవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓ చెట్టు కింద అక్రమంగా నిల్వ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్‌బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ తెలిపారు. కారేపల్లి మండలం మేకలతండాకు చెందిన భూక్యా రమేశ్, మాలోత్ రమేశ్‌లు కలిసి చుట్టుప్రక్కల తండాల్లో ఇంటింటికి తిరిగి రేషన్‌బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి సరిహద్దుతండా సమీపంలో ఓ చెట్టు కింద రేషన్ బియ్యంను నిల్వ చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి అక్రమంగా నిల్వ చేసిన 12 క్వింటాళ్ల బియ్యం మూటలను స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్ : జూలై 7న వరంగల్‌లో జరగనున్న దళితుల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గుగ్గిళ్ల పీరయ్య మాదిగ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓసీ క్లబ్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ప్రజాసంఘాల సమావేశం పోలెపాక ప్రవీణ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీరయ్య మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ పోరాటం 30 ఏళ్ల ఆకాంక్ష, వర్గీకరణ పోరాటం అంతిమ దశకు చేరుకున్న నేపథ్యంలో ఆత్మగౌరవ కవాతును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాదిగ, మాదిగ ఉప కులాలు అధిక సంఖ్యలో కవాత్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షురాలు ఎండీ.రజియా, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక, మిడతపల్లి యాకయ్య, ఎండీ. పాషా, సోమయ్య, సంజీవ, రమేశ్, రాఘవులు, సైదులు, సరిత, సుమిత్ర, పద్మ, సంధ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీరయ్య మాదిగ

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



మహబూబాబాద్ రూరల్ : బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎస్సై గోపి



గంగారం: చెక్కర పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రుతండా, సికింద్రాబాద్ తండా పరిధిలోని గుడుంబా స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి 5 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని 500 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేశారు. రూరల్ రెండో ఎస్సై కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

కేసముద్రం: కేసముద్రం శివారు కట్టుకాల్వ తండాలో 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కురవి: మండలంలోని రాజోలు శివారు స్టేషన్‌గుండ్రాతిమడుగులో నిర్వహించిన దాడుల్లో 250 లీటర్ల పానకం ధ్వంసం చేశారు. కార్యక్రమంలో కురవి ఎస్సై బి.గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

గంగారం : గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 120 లీటర్ల చక్కర పానకం ధ్వంసం చేసి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవి కుమార్ తెలిపారు. గంగారం మండలంలోని జంగాలపల్లిలో గుడుంబా తయారు చేస్తున్న సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 120 లీటర్ల చక్కర పానకం లభ్యం కాగా వెంటనే ధ్వంసంచేసి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

తొర్రూరు: గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించిన ఘటన మంగళవారం డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణంలోని దుబ్బతండాలో పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 10 లీటర్ల నాటుసారా, 200 లీటర్ల చక్కెర ల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎవరైనా గ్రామాల్లో గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్సై రాంజీనాయక్ తెలిపారు.

అమీనాపురంలో ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కేసముద్రం: మండలంలోని అమీనాపురంలోని శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం బాలభోగం, యాగశాలలో నిత్యవిధి హోమాలు, పూర్ణాహుతి, బలిహరణ పూజాకార్యక్రమాలను పండితులు నిర్వహించారు. అనంతరం మహన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి ఉత్సవవిగ్రహాలను ఆలయం నుంచి జ్యోతిరావుపూలే సెంటర్ మీదుగా మోహన్ థియేటర్ వరకు కోలాటాల మధ్య శోభాయాత్ర నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజు, మహేందర్‌రెడ్డి, పరమేశ్వర్, నాగరాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.



తాళిబొట్టును చూపిస్తున్న వేదపండితులు

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్ : రాజ్యాంగ పరిరక్షణ, దళితుల హక్కుల సాధన కోసం జూలై 21, 22 తేదీల్లో మహబూబాబాద్‌లో జరిగే కేవీపీఎస్ సామాజిక చైతన్య శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి పిలుపునిచ్చారు. సంఘ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని, ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టడంతో బీజేపీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సామాజిక ఉద్యమాలను నిర్వహిస్తూ పోరాడుతున్న కేవీపీఎస్ శిక్షణ తరగతులను, ఉద్యమాలను విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మందుల మహేందర్, శేషం ప్రశాంత్, పులిపాక నాగరాజు, దారావత్ మల్లేష్, ఎల్లయ్య, మచ్చ వెంకన్న, వెంకటరాములు, ప్రసాద్, ఖాదర్‌బాబా, జానీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తి

'ఎమర్జెన్సీతో చీకటి రోజు'



సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణ్ నాయక్

మహబూబాబాద్ అర్బన్: ఇందిరాగాంధీ హయాంలో భారతదేశ చట్టాలను మార్చి జూన్ 25న దేశానికి ఎమర్జెన్సీతో చీకటిరోజు ప్రకటించారని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం బ్లాక్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ్‌నాయక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పాతరేసి, నియంతృత్వ పోకడలు పొడసూపి దేశమంతా చీకటి నింపి, స్వాతంత్ర్యాన్ని ఖూనీ చేసి రాక్షసత్వ రాజ్యమేలుతుందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేసి తెలంగాణ రాష్ట్రంలో కాషాయం జెండా ఎగురవేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆ రోజుల్లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన జయప్రకాష్ నారాయణ, శ్యామ్ ముఖర్జీ, మొరార్జీ దేశాయ్, అటల్‌బిహారీ వాజ్‌పేయి లాంటి ఎంతో మంది నాయకులను జైలుకు పంపించి ఇందిరాగాంధీ నియంతృత్వాన్ని చాటిందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి మోసంగి మురళి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శశివర్ధన్‌రెడ్డి, పెంటయ్య, జిల్లా అధికార ప్రతినిధి ఇందుభారతి, మానుకోట పార్లమెంట్ కన్వీనర్ సతీష్, అసెంబ్లీ కన్వీనర్ కొమ్మారెడ్డి, వెంకట్‌రెడ్డి,వెంకటేశ్వర్లు, మహేష్, వెంకటచారి, శ్రీను పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు వేతనచట్టం తేవాలి

దంతాలపల్లి : దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంపై ఆధారపడిన కూలీలకు సమగ్ర వేతన చట్టం తేవాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజపల్లి వీరన్న అన్నారు. మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు 365 రోజుల్లో సగం రోజులు మాత్రమే కూలీ దొరుకుతుందని, మిగిలిన రోజులు పట్టణాలకు వలస వెళ్తున్నారని గుర్తుచేశారు. కూలీలు వలస పోకుండా ఉపాధి హామీ పథకం ప్రారంభించినా వేతనాలు ఇవ్వడంలో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రతి పేద కుటుంబానికి రూ. 12 వేల ఆర్థికసాయం అందివ్వడం కోసం విధి,విధానాలు ఖరారు చేసి కూలీలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం తొర్రూరు డివిజన్ ప్రధానకార్యాదర్శి సెగ్గం యాకన్న, ఉప్పలయ్య, నాగయ్య, వెంకన్న, లింగయ్య, ప్రవీణ్, శ్రీను పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీరన్న, నాయకులు

సంక్షిప్త సమాచారం

జీరో సర్వీస్‌తో కూడిన బదిలీలు చేపట్టాలి



తొర్రూరు : అధ్యాపకులకు జీరో సర్వీస్‌తో కూడిన బదిలీలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకుడు నారాయణ నేతృత్వంలో అధ్యాపకులు మంగళవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను మర్యాదపూర్వంగా కలిశారు. సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఆయన వెంట గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి రవి, అసోసియేట్ అధ్యక్షుడు విష్ణు, రాజు, వినోద్‌లు ఉన్నారు.

ప్రైవేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి


కేసముద్రం: నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న స్కూల్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా శ్రీచైతన్య స్కూల్ పేరుతో పాఠశాలను నడిపిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

చర్యలు తీసుకోవాలి

బయ్యారం: మహిళలు, చిన్నారులపై దాడులకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు కవిత అన్నారు. మండలంలోని వెంకట్రాంపురంలో మంగళవారం నిర్వహించిన ఆ సంఘం మహాసభను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో లైంగికదాడులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మహాసభ ప్రారంభానికి ముందు సంఘం జెండాను పీఓడబ్ల్యూ మండల అధ్యక్షురాలు బొల్లం సోమక్క ఆవిష్కరించారు.

గుండెపోటుతో పీఏసీఎస్ డైరెక్టర్ మృతి

గార్ల : స్థానిక పీఏసీఎస్ డైరెక్టర్ పతంగి సత్యనారాయణ(70) గుండెపోటుకు గురై మంగళవారం మృతి చెందాడు. ఉదయం ఛాతిలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలుపడంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స జరిపిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి పోయి మృతి చెందాడు. భౌతికాయంను వివిధ పార్టీల నాయకులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



సత్యనారాయణ (ఫైల్)

వ్యక్తిగత పరిశుభ్రతే కీలకం

డోర్నకల్: వ్యక్తిగత పరిశుభ్రత, తాజా ఆహారం తీసుకోవడంతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ తెలిపారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో మంగళవారం పీహెచ్‌సీ వైద్యులు ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ ఆధ్వర్యంలో 156 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న రైతులు

గార్ల: ఖరీఫ్ ప్రారంభమైన తరుణంలో మండలంలో రైతులు సాగుకు సమాయత్తం అయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు స్థానిక పెద్దచెరువు ఆయకట్టు కింద వరిపొలాల్లో దుక్కులు దున్నుకొని నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో ఇప్పటికే చెరువులు, కుంటల్లో సగం మేర నీళ్లు చేరాయి.

పేదలకు ఆహారం ప్యాకెట్ల పంపిణీ

మహబూబాబాద్ రూరల్ : గ్లోబల్ పీస్ ఫౌండేషన్, బాలునాయక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణలో పేదలకు మంగళవారం ఆహారం ప్యాకెట్లను పంపిణీ చేశారు.ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య బాలునాయక్, వేణుగోపాల్ నాయక్, సురేందర్ నాయక్, భూక్య సురేష్ బషీరుద్దీన్ పాల్గొన్నారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

దంతాలపల్లి : తాటిచెట్టుపై నుంచి కింద పడడంతో గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని బీరిశెట్టిగూడేనికి చెందిన గండి వెంకన్న కులవృత్తిలో భాగంగా సోమవారం సాయంత్రం రోజు వారి మాదిరిగానే తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడిపోయాడు, గమనించిన కొందరు ఇంటికి సమాచా రం చేరవేశారు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గ్యాస్ సబ్సిడీ ఖాతాల్లో జమకావడం లేదు

గార్ల: వంటగ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ నగదు బ్యాంకుల్లో జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో క్యూలో నిల్చొని ఉన్న లబ్ధిదారులు విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే సిలిండర్ రూ.500 కే ఇస్తామని హామీ ఇవ్వడంతో ఓట్లేసి గెలిపిస్తే, సబ్సిడీ నగదు తమ ఖాతాల్లో జమకావడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గృహజ్యోతి పథకం జీరో బిల్లులు అనేక మందికి రావడం లేదన్నారు.

నేడు బొడ్రాయి వార్షికోత్సవం

కురవి: మండల కేంద్రంలో బుధవారం జరిగే ప్రథమ బొడ్రాయి వార్షికోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన బొడ్రాయి వద్ద నిర్వాహకుడు బుక్క వీరన్న ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం ఉదయం నుంచి బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించిన అనంతరం జలాభిషేకం చేయాలని సూచించారు.

శిఖం భూమి సర్వే

డోర్నకల్ : పట్టణ శివారులోని బంధంచెరువు శిఖం భూమిని రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది సర్వే నిర్వహించారు. చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురైందంటూ కొంతమంది రైతులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది సంయుక్తంగా సర్వే నిర్వహించారు. నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

ఫారెస్ట్‌ను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

గూడూరు: మండలంలోని భూపతిపేట, మర్రిమిట్ట, వెంగంపేట బీట్ పరిధిలోని 1037 కంపార్ట్‌మెంట్‌లో ఇటీవల అక్రమంగా ఫారెస్ట్‌లో చెట్లను నరికించిన పోలీసు ఉన్నతాధికారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కట్ల నరేందర్‌రెడ్డి, బొద్దు కిరణ్, గ్రామస్తులు డిమాండ్ చేశారు. వెంగంపేటలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలోనే లైన్‌తండాకు చెందిన పోలీసు ఉన్నతాధికారిగా గుర్తింపు పొందిన వ్యక్తి మండల ఫారెస్టు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తన పేర ఆర్ఓఎఫ్ఆర్ పత్రాలు సృష్టించాడని ఆరోపించారు. ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మానుకోటలో సంబురాలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులుగా పోరిక బలరాంనాయక్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు బట్టు దేవ్ సింగ్, 26వ వార్డు అధ్యక్షుడు బండి వెంకన్న, వంగూరి పరశురాములు, భూక్య సురేష్, వెంకన్న పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

కేసముద్రం: మండలంలోని నర్సింహులగూడెం జీపీలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కొడిపాక రమేశ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ పనస మొక్కలను మంగళవారం పంపిణీ చేశారు. ఇంటి ఆవరణలో ఖాళీ స్థలం ఎక్కువగా ఉన్న వారందరికీ హైబ్రిడ్ మొక్కలను నాటినట్లు తెలిపారు.

గుట్కాల పట్టివేత

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని బాలాజీ కిరాణం షాపులో రూ.21వేల విలువైన అంబర్లు, గుట్కాలను స్వాధీనం చేసుకున్నామని టౌన్ సీఐ దేవేందర్ మంగళవారం రాత్రి తెలిపారు. పక్కా సమాచారం మేరకు టౌన్ ఎస్సై విజయకుమార్, సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేయగా అంబర్లు, గుట్కాలు దొరికినట్లు సీఐ చెప్పారు. షాపు యజమాని లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేశామని తెలిపారు.

పరామర్శ

కురవి: స్థానిక జెడ్పీ హైస్కూల్ మాజీ విద్యా కమిటీ చైర్మన్ మిర్యాల లక్ష్మయ్య తల్లి ముత్తమ్మ సోమవారం రాత్రి మృతి చెందింది. మంగళవారం కురవి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌కుమార్, నాయకులు ఎర్ర నాగేశ్వర్‌రావు, బానోత్ తుకారంనాయక్, బుక్క నాగరాజు, లక్ష్మణ్‌నాయక్, చిన్నం గణేష్, దైద భద్రయ్య, తరాల వీరన్న, కొత్త యాకరాజు, గడీల వినోద్, కంచం నాగరాజు, ఇరుగు నాగన్నలు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.